## కుంకుమేశ్వర ఆలయంలో లక్షపుష్పార్చన


లక్ష పుష్పార్చనలో స్వామివారు

పరకాల, డిసెంబర్ 4 : పట్టణంలోని శ్రీ భవానీ కుంకుమేశ్వర ఆలయంలో కార్తీకమాస ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం లక్ష పుష్పార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. శైవాగమ పండితుడు కోమాళ్లపల్లి సంపత్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు, సాయంత్రం గందె ఉదయ లక్ష్మీ సత్యానందం కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో లక్ష పుష్పార్చన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గందె వెంకటేశ్వర్లు, అర్చకులు కోమాళ్లపల్లి నాగభూషణ శర్మ, ఈవో వెంకటయ్య, భక్తులు పాల్గొన్నారు.


శివలింగ ప్రతిష్ఠాపన పూజలు చేస్తున్న భక్తులు

## వైభవంగా శివలింగ ప్రతిష్ఠాపనోత్సవాలు

దామెర, డిసెంబర్ 4 : మండలంలోని వెంకటాపురంలో శ్రీశివపంచాయతన నూతన దేవాలయంలో శివలింగ ప్రతిష్ఠాపనోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం అఖండ దీపారాధన, కలశపూజ, గణపతి పూజ నిర్వహించారు. భక్తులు తరలివచ్చి పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించారు. అనంతరం అర్చకులు కొలనుపాక సంతోష్‌కుమార్, లేదళ్ల శ్రీనివాసరావు పూజలు చేశారు. మంగళవారం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్, సర్పంచ్ పున్నం సంపత్ రజిత తెలిపారు. కార్యక్రమంలో మోర్తాల అంకూస్, మోర్తాల శ్రీనివాస్, సుగుణా సంపత్, సదాశివుడు, కైలాస్, బొనగాని రాజు, పున్నం రమేశ్, కుసుంబ బాబురావు, పంచగిరి రాజ్‌కుమార్, రజనీకాంత్, ఇటికాల బాబురావు, శ్రీధర్, ఇటికాల రాజు, నాగరాజు, సిందె రమేశ్, ఇజ్జగిరి రాజు, గజ్జుల రాజు, బొమ్మ దేవేందర్, గోల్కొండ నర్సయ్య పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో కృష్ణమూర్తి

## గ్రామానికి 50 మంది తగ్గకుండా కూలీలు రావాలి

### సమీక్ష సమావేశంలో ఎంపీడీవో కృష్ణమూర్తి

శాయంపేట, డిసెంబర్ 4 : జాతీయ ఉపాధి హామీ పథకంలో ప్రతి గ్రామంలో 50కి తగ్గకుండా కూలీలు పనుల్లోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో అమంచ కృష్ణమూర్తి అన్నారు. శాయంపేటలోని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సోమవారం ఉపాధి హామీపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండల పరిధిలోని 24 గ్రామ పంచాయతీల్లో ఉపాధిహామీ పనులు నెమ్మదిగా జరుగుతున్నట్లు తెలిపారు. ఏ గ్రామంలోనూ 15 మందికిపై కూలీలు పనుల్లోకి రావడం లేదన్నారు. అందుకే ఎఫ్‌ఏలు ప్రతి గ్రామంలో కూలీలు 50కి తగ్గకుండా వచ్చేలా కలెక్టర్ ఆదేశాలను పాటించాలన్నారు. కూలీల సంఖ్య తక్కువగా ఉండొద్దన్నారు. ప్రతి కూలీకి కూడా నిర్దేశిత డబ్బు వచ్చేలా పనులు కల్పించాలన్నారు. రోజుకు రూ.275 వచ్చేలా వారికి నిర్దేశిత పని అప్పగించాలన్నారు. తప్పనిసరిగా కనీసం మూడు నుంచి నాలుగు గంటలు పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే, ప్రతి గ్రామంలో నర్సరీ పనులను వేగవంతం చేయాలన్నారు. బ్యాగుల్లో వెంటనే మట్టి నింపి నెలాఖరు వరకు విత్తనాలు పెట్టేలా సిద్ధం చేయాలన్నారు. గ్రామపంచాయతీ పరిధిలోని అన్ని పనులను శ్రద్ధగా చేయాలన్నారు. సమావేశంలో ఏపీవో అనిత, ఈసీ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



నూతనంగా ఎమ్మెల్యేగా ఎన్నికైన కడియం శ్రీహరికి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలుపుతున్న దేవునూర్, శాయిపేట గ్రామాల బీఆర్‌ఎస్ నాయకులు

# ఎమ్మెల్యే కడియంను కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు

ధర్మసాగర్, డిసెంబర్ 4 : స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యేగా గెలుపొందిన మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరిని మండలంలోని పలు గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం ఇచ్చి, శుభాకాంక్షలు తెలిపారు. కాగా, తన మీద నమ్మకంతో గెలిపించిన ప్రజలకు ఈ సందర్భంగా కడియం శ్రీహరి కృతజ్ఞతలు తెలిపారు. ఆయనను కలిసిన వారిలో నారాయణగిరి సర్పంచ్ కర్ర సోమిరెడ్డి, ధర్మసాగర్ సర్పంచ్ ఎర్రబెల్లి శరత్‌చంద్రప్రసాద్, నాయకులు కొలిపాక రమేశ్, దేవునూర్ సర్పంచ్ చిర్ర కవిత, ఎంపీటీసీ లక్క సునీత, మాజీ సర్పంచ్ స్వామి, నాయకులు యాదగిరి, దయాకర్, జంగ సంపత్, శాయిపేట సర్పంచ్ మామిడి రవీందర్ యాదవ్, మండల రైతు బంధు సమితి కోఆర్డినేటర్ సోంపెల్లి కరుణాకర్, కుమార్, వెంట్రాజం ఉన్నారు.

## ఎమ్మెల్యేలుగా కడియం, పల్లా విజయంపై హర్షం

### గట్టు మల్లికార్జున స్వామి ఆలయంలో సర్పంచ్ రాజిరెడ్డి ప్రత్యేక పూజలు


ఆలయంలో పూజలు చేస్తున్న సర్పంచ్ గోదల రాజిరెడ్డి, కుటుంబ సభ్యులు

వేలేరు, డిసెంబర్ 4 : తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎన్నికల ఫలితాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి కడియం శ్రీహరి, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి విజయం సాధించడంపై మల్లికుదుర్ల సర్పంచ్ గోదల రాజిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం మల్లికుదుర్ల గట్టు మల్లికార్జున స్వామి ఆలయంలో సర్పంచ్ రాజిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి అర్చన, అభిషేకం చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేలేరు మండల అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి జనగామ ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించడం సంతోషకరమన్నారు. అలాగే, స్టేషన్ ఘన్‌పూర్‌లో కడియం శ్రీహరి విజయం సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. కడియం శ్రీహరి నాయకత్వంలో స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గం మరింతగా అభివృద్ధి సాధిస్తుందని పేర్కొన్నారు. మల్లికుదుర్ల గ్రామంలో కడియం శ్రీహరి విజయానికి కృషి చేసిన ప్రతి కార్యకర్తకు, నాయకులకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు. ఆయన వెంట కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

హనుమకొండ సిటీ, డిసెంబర్ 4 : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అక్టోబర్‌లో నిర్వహించిన ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షల ఫలితాలు విడుదల చేసినట్లు డీఈవో అబ్దుల్ హై ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాలను www.telanganaopenschool.org అనే వెబ్‌సైట్‌లో చూసుకోచ్చని సూచించారు. ఈ నెల 7 నుంచి 16 వరకు రీవెరిఫికేషన్, రీ కౌంటింగ్‌కు మీ సేవ ద్వారా ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మురాల శంకర్ 8008403631 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

## రోడ్డు ప్రమాదంలో బీఆర్‌ఎస్ నాయకుడి మృతి

ఏటూరునాగారం, డిసెంబర్ 4 : రొయ్యూరుకు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు జాడి లక్ష్మణ్ స్వామి ఆదివారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆయన ఏటూరునాగారం వచ్చి రొయ్యూరుకు బైక్‌పై తిరిగి వెళ్తున్న క్రమంలో ఓ వ్యాన్ వెనుక నుంచి ఢీ కొట్టింది. దీంతో రెయిలింగ్‌కు తల తగిలి లక్ష్మణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున్న రమేశ్ కాలు విరిగింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

- సులువైన పద్ధతితో వరి విత్తే విధానం
- పెట్టుబడి తక్కువ, ఎకరానికి 10 కిలోల విత్తనాలు సరి..
- ఆసక్తి కనబరుస్తున్న రైతులు

# డ్రమ్‌సీడర్‌తో అధిక లాభాలు


వంతడపలలో డ్రమ్‌సీడర్ పద్ధతిలో వరినాట్లు వేస్తున్న రైతు



నర్సింహులపేట, డిసెంబర్ 4: కూలీల కొరత, పెట్టుబడి తగ్గించడంపై అన్నదాత దృష్టి సారించారు. ఇందులో భాగంగా డ్రమ్ సీడర్ విధానంతో వరి విత్తే పద్ధతిని అమలు చేస్తున్నారు. రోజురోజుకూ పెరుగుతున్న టెక్నాలజీతో రైతులు కూడా యంత్రీకరణ సాగుకు ముందుకు వస్తున్నారు. సులువైన పద్ధతిలో పంటలు సాగు చేస్తున్నారు. డ్రమ్ సీడ్‌ర్ విధానంతో తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 16 మండలాల్లో వివిధ గ్రామాల్లో వ్యవసాయశాఖ అధికారుల సూచనల మేరకు రైతులు ఆధునిక డ్రమ్‌సీడర్ పద్ధతితో వరినాట్లు వేస్తున్నారు. మామూలుగానైతే 25 కిలోల విత్తనాలు నారు పోయాల్సి ఉంటుంది. నాటు కోసం పది మంది కూలీల వరకు అవసరం ఉంటుంది. కానీ డ్రమ్ సీడర్ ద్వారా నారు పోయాల్సిన అవసరం లేదు. ఎకరం పొలానికి 8 నుంచి 10 కిలోల విత్తనాలు మాత్రమే అవసరమవుతాయి.

**విత్తనాలు విత్తుకునే పద్ధతి..**

వరి విత్తనాలను ఒకరోజు నానబెట్టి మొలకలు రాకుండా చూసుకోవాలి. డ్రమ్స్ నుంచి విత్తనాలు బయటకు రావాలంటే మొలకలు రానివ్వకూడదు. సిద్ధం చేసిన మండులలో కూలీలు అవసరం లేకుండానే డ్రమ్‌ల్లో పోసేందుకు మోతాదు కోసం ఓ డబ్బాతో నానా బెట్టిన వరి విత్తనాలను పోసుకోవాలి. వరుస క్రమంలో డ్రమ్ ద్వారా పొలంలో పడుతాయి. వారం రోజుల వరకు మొలకల బయటకు వస్తాయి. డ్రమ్ సీడర్ ద్వారా వరి పంటను సాగు చేయడంలో మొలకలు దూరంగా పెరగంతో కలుపు తక్కువగా వస్తుంది. పంట కూడా 20 నుంచి 30 రోజుల ముందు రావడంతో పాటు దిగుబడి కూడా 10 బస్తాల వరకు ఎక్కువ వస్తుంది. జిల్లా వ్యాప్తంగా 16 మండలాల్లో యాసంగిలో 10వేల ఎకరాల్లో రైతులు డ్రమ్‌సీడర్‌తో సాగు చేస్తున్నట్లు వ్యవసాధికారులు చెబుతున్నారు.

**తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి**

వరి నాటు ఖర్చుతో పాటు కలుపు తీసే అవకాశం లేకపోవడంతో నాటు కూలీ ఎకరానికి రూ.5వేలు, కలుపునకు రూ.4 వేలు ఖర్చు తగ్గుతుంది. ఎకరానికి 20 కిలోల విత్తనాలకు బదులు 10 కిలోల విత్తనం మాత్రమే అవసరం అవుతుండడంతో రైతులకు రూ.8 నుంచి రూ.10 వేల వరకు ఖర్చు తగ్గుతుంది. దీనికి తోడు ఎకరానికి 10 బస్తాల వరకు దిగుబడి అధికంగా వస్తుంది. ఒకసారి నాటు వేసే కూలీల ఖర్చుతో డ్రమ్ సీడ్‌ను కొనుగోలు చేసుకోవచ్చని రైతులు, వ్యవసాయశాఖ అధికారులు తెలుపుతున్నారు.